క్లుప్తంగా

ఉద్యాన తోటల సాగుకు ప్రోత్సాహం



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మద్దికెర: వ్యవసాయ బావులు, బోర్లు కలిగిన రైతులు పండ్ల తోటల సాగుకు ముందుకు రావాలని, ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ నరసింహమూర్తి, ఏపీఓ నర్సిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల మొక్కలు పంపిణీ చేయడమే గాకుండా మూడేళ్లపాటు నిర్వహణ ఖర్చులు అందిస్తుందన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించేందుకు వీలుంటుందన్నారు.

వెల్దుర్తిలో ప్రబలుతున్న జ్వరాలు

వెల్దుర్తి: మండల కేంద్రంలో చిన్నారులకు జ్వరాలు ప్రబలుతున్నాయి. బుధవారం ఒక్కరోజే స్థానిక సీహెచ్‌సీలో దాదాపు 40 మంది జ్వరాల బారిన పడిన చిన్నారుల ఓపీ నమోదైనట్లు వైద్యాధికారి బాలచంద్రారెడ్డి తెలిపారు. వీరిలో కొందరికి సాధారణ సీజనల్ జ్వరాలు కాగా మరి కొందరికి పచ్చ కామెర్లు, వాంతులు సైతం ఉన్నట్లు గుర్తించి చికిత్స అందించినట్లు తెలిపారు. ఇటీవల వర్షాలకు చిన్నారుల్లో జ్వరాలు ప్రబలుతున్నట్లు తెలుస్తోంది. విష జ్వరాల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

డిప్యూటీ ఈఓ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డీఈఓ రంగారెడ్డి

పత్తికొండ రూరల్: పత్తికొండలో డిప్యూటీ ఈఓ కార్యాలయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి రంగారెడ్డి బుధవారం ప్రారంభించారు. ప్రస్తుతానికి మండల విద్యాశాఖ కార్యాలయంలోనే డిప్యూటీ ఈఓ కార్యాలయం కొనసాగుతుందన్నారు. ఇన్‌చార్జ్‌గా డీఈఓ వ్యవహరించనున్నారు. ముందుగా దూదేకొండ ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేసేందుకు నివేదిక పంపించాలని హెచ్ఎంను ఆదేశించారు. పత్తికొండలోని జెడ్పీ బాలికల హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈఓలు రమేష్, రంగస్వామి ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

కృష్ణగిరి: జగనన్న లేఅవుట్లలో లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ డీఈ విజయకుమార్ ఆదేశించారు. స్థానిక హౌసింగ్ కార్యాలయాన్ని ఆయన బుధవారం పరిశీలించి ఇంటి నిర్మాణాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారులు నిర్దేశించిన టార్గెట్‌ను పూర్తి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో ఇంటి నిర్మాణాలను పరిశీలించి బిల్లులకు సిఫార్సు చేయాలన్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ మనోహర్ ఉన్నారు.

పరిహారం చెల్లిస్తేనే భూములిస్తాం

గోనెగండ్ల: గాజులదిన్నె ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో ఉన్న భూములకు పరిహారం చెల్లిస్తేనే భూములిస్తామని రైతులు నజీర్, కౌలుట్లయ్య, మా బాష తెలిపారు. గాజులదిన్నె ప్రాజెక్టు ఆనకట్ట ఎత్తు పెంచేందుకు ప్రభుత్వం రూ.57 కోట్లు విడుదల చేసింది. జీడీపీ ఆయకట్ట ఎత్తు పెంచే పనులు, గేట్ల మరమ్మతు పనులు జరుగుతున్నాయి. ఈ పనుల్లో భాగంగా బుధవారం అధికారులు జీడీపీ ఎగువ ప్రాంతంలోని భూములను సర్వే చేయడానికి వెళ్లారు. అయితే ఐరన్‌బండ, ఎన్నెకండ్ల గ్రామస్తులు సర్వే చేస్తున్న అధికారులను అడ్డుకున్నారు. అనంతరం జీడీపీలోని కార్యాలయంలో డీఈ విజయకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రైతులు మాట్లాడుతూ జీడీపీ ఎత్తు పెంచితే దాదాపు 400 ఎకరాల భూమిని రైతులు కోల్పోతారని, ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించి, జీఓ 98 ప్రకారం ఇంటికో ఉద్యోగం కల్పిస్తేనే భూములిస్తామన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని డీఈ విజయకుమార్ తెలిపారు.

నేడు ఫిర్యాదు విభాగం ప్రారంభం

ఎమ్మిగనూరురూరల్: స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఫిర్యాదు విభాగ భవనాన్ని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ గురువారం ప్రారంభించనున్నట్లు రూరల్ పోలీసులు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎస్పీ ఎమ్మిగనూరుకు రానుండటంతో రూరల్ పోలీసులు ప్రారంభోత్సవ ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణ, ట్రాఫిక్ పోలీసులు తమ స్టేషన్ల రికార్డులను సక్రమంగా పెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు.

అర్హులందరికీ కొత్త పింఛన్లు





ఎమ్మిగనూరులో పింఛన్లు అందుకున్న లబ్ధిదారులతో వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆస్పరి సచివాలయంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ మూలింటి రాధమ్మ

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్ మంజూరు చేస్తుందని వైస్ ఎంపీపీ జయలక్ష్మి, సహకార సంఘం చైర్మన్ సుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు భరత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని బురుజుల గ్రామంలో రెండవ విడతలో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పింఛన్ల కోసం గతంలో మాదిరిగా ఎవరి మీద ఆధారపడవలసిన అవసరం లేదన్నారు. అర్హత వుంటే ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు అందిస్తారన్నారు. ఈఓ హరికృష్ణ తదితరులు ఉన్నారు.

ఆస్పరి: ఆస్పరి సచివాలయంలో బుధవారం కొత్తగా మంజూరైన ఫించన్లను సర్పంచ్ మూలింటి రాధమ్మ, కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ మండలంలో కొత్తగా అర్హత సాధించిన మొత్తం 184 మందికి పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ రాజెమ్మ తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రకాష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: మండలంలోని మొత్తం 17 గ్రామ సచివాలయాల పరిధిలో కొత్తగా 207 పింఛన్లు మంజూరయ్యాయి. ఇందులో భాగంగా బుధవారం తుంబళబీడు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లికార్జున లబ్ధిదారులకు నూతన పింఛన్లు అందజేశారు. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

హొళగుంద: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పింఛన్ అందుతుందని మండల ప్రత్యేకధికారి రామచంద్రయ్య అన్నారు. బుధవారం ఆయన ఎల్లార్తి గ్రామ సచివాలయంలో కొత్తగా మంజూరైన పింఛన్లను వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్కే గిరి, ఈఓపీఆర్డీ చంద్ర మౌళీశ్వరగౌడ్, పశు వైద్యాధికారి సోమశేఖర్‌గౌడ్ తదితరులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. అదేవిధంగ హొళగుంద, సుళువాయి తదితర గ్రామాలలో సర్పంచ్‌లు చలువాది రంగమ్మ, మౌలాలి, పంచాయతీ సెక్రటరీలు రాజశేఖర్, షఫి, వైఎస్సార్‌సీపీ



బరురుజుల గ్రామంలో ఇంటి వద్దకే వెళ్లి కొత్త పింఛన్లు అందిస్తున్న దృశ్యం

నాయకులు పంపాపతి తదితరులు కొత్త పింఛన్లను పంపిణీ చేశారు. మండలంలో కొత్తగా 237 మందికి పింఛన్లు మంజూరైనట్లు అధికారులు వెల్లడించారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో కొత్తగా మంజూరైన పలు రకాల పింఛన్లను ఆయా వార్డు కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు సచివాలయ సిబ్బందితో కలిసి బుధవారం 11వ వార్డు సచివాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. 16వ వార్డు కౌన్సిలర్ వాహిద్, పార్టీ నాయకులు బజారిరెడ్డి పాల్గొన్నారు.

సంతోషంగా ఉంది



కొత్త పింఛన్లు మంజూరయ్యాయని చెప్పగానే చాలా సంతోష పడ్డాం. మొదటి విడతలో రాకపోతే కాస్త ఆందోళన చెందాను. వెరిఫికేషన్ పూర్తయ్యక రెండవ విడతలో పింఛన్ మంజూరయిందని వలంటీర్ కాశీంనాయుడు చెప్పడంతో చాలా సంతోషించాను. ఇంటి వద్దకే వచ్చి పింఛన్ ఇచ్చి వెళ్లారు.

– షేకున్ బీ, పెరవలి

పైసా ఖర్చు కాలేదు



పింఛన్ దరఖాస్తు చేసేందుకు వలంటీర్ రేణుక ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ తీసుకెళ్లింది. పైసా ఖర్చు లేకుండా కార్యాలయాల చుట్టూ తిరగకుండా రెండవ విడతలో పింఛన్ మంజూరయ్యింది. నాకు నడిచేందుకు చేతకాదు. ఇంటి వద్దకే వచ్చి పింఛన్ అందించడంతో చాలా సంతోషంగా ఉంది. మాలాంటి ముసలోళ్లకు ఇంకేమి కావాలి.

– గుడిసె రంగస్వామి, పెరవలి



ఎల్లార్తిలో లబ్ధిదారులకు పింఛన్లు ఇస్తున్న మండల ప్రత్యేకధికారి రామచంద్రయ్య

కలుగొట్లలో సీసీ రోడ్డు నిర్మాణం

వెల్దుర్తి: మండల పరిధిలోని కలుగొట్ల గ్రామం ఎస్సీ కాలనీలోని చెన్నకేశవ స్వామి ఆలయ సమీపంలో సీసీ రోడ్డు నిర్మాణాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, రామాంజనేయులు బుధవారం ప్రారంభించారు. రూ.10 లక్షల నిధులతో 240 మీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు ఇంజినీరింగ్ అసిస్టెంట్ పవన్ తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి స్థానిక సమస్యలు గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు వెల్లడించారు.

సెల్‌ఫోన్ చోరీ

వెల్దుర్తి: స్థానిక రైల్వేస్టేషన్‌లో బుధవారం పట్టణవాసి చిన్నా సెల్‌ఫోన్ చోరీ జరిగింది. ఉదయం 9 గంటలకు కర్నూలుకు వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌లో ఎదురు చూస్తూ, బెంచ్‌పై కూర్చుని ఉండగా ఒక్క క్షణం ఫోన్‌ను పక్కన పెట్టాడు. ఆ సమయంలో ఓ వ్యక్తి వెనుకనుంచి ఫోన్‌ను తస్కరించి పారిపోయాడని బాధితుడు తెలిపాడు. పక్కనున్న వారు చెప్పడంతో నిందితుడిని వెంబడించానని అడ్డ పంచ, తువ్వాలు వేసుకున్న దుండగుడు క్వార్టర్స్‌వైపు పరిగెత్తి కనిపించలేదని చెప్పాడు.

గోశాలకు ఆవుల తరలింపు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో రోడ్లపై సంచరిస్తున్న పశువులను మున్సిపల్ సిబ్బంది బుధవారం లారీలో ఆదోనిలోని గోశాలకు తరలించారు. యజమానులు పశువులను రోడ్లపైకి వదిలి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కేసులు నమోదు చేయించడమే గాకుండా జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని ప్రధాన రహదారుల్లో సంచరించే పశువులను వాటి యజమానులు వెంటనే తీసుకెళ్లాలని లేకపోతే చర్యలు తప్పవన్నారు.

ఓటరు జాబితా పక్కాగా రూపొందించాలి

ఎమ్మిగనూరురూరల్: ఓటరు జాబితాను పక్కాగా రూపొందించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి ఆదేశించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్వోలతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాపై అభ్యంతరాలను చూయించేందుకు 18వ తేదీ వరకు అవకాశం ఉందని చెప్పారు. రాజకీయ పార్టీల నాయకులు ఓటరు జాబితా పరిశీలనకు వచ్చే బీఎల్వోలకు సహకరించాలని కోరారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే వారందరికీ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం తహసీల్దార్లు ఆంజనేయులు, వేణుగోపాల్‌శర్మ, నిత్యానంద్, ఎన్నికల డీటీ గురురాజావు, బీఎల్వోలు, వివిధ శాఖల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

చురుగ్గా రోడ్డు నిర్మాణం



పగిడిరాయి వద్ద బీటీ రోడ్డు పనులను తనిఖీ చేస్తున్న పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు

తుగ్గలి: కొన్నేళ్ల నుంచి సమస్యగా ఉన్న జొన్నగిరి–పగిడిరాయి రోడ్డు మరమ్మతు పనులు వేగంగా సాగుతున్నాయి. జొన్నగిరి నుంచి పెండేకల్లు రైల్వే జంక్షన్ వరకు బీటీ రోడ్డు అధ్వానంగా మారి రాకపోకలు సాగించేందుకు వాహన దారులు, ప్రయాణికులు ఇన్నాళ్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమస్యను వైఎస్సార్‌సీపీ నాయకుడు జగన్నాథరెడ్డి, ప్రజలు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే కృషితో రోడ్డు మరమ్మతులకు మార్కెట్ యార్డు అభివృద్ధి నిధులు రూ.1.99 కోట్లు మంజూరయ్యాయి. అయితే సాంకేతిక కారణాలతో కొన్ని నెలలుగా పనుల్లో జాప్యం చోటు చేసుకుంది. ఎమ్మెల్యే కృషితో ఇబ్బందులు తొలగి పనులు వేగవంతమయ్యాయి. ఈ పనులను పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. ఎట్టకేలకు రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం కావడంతో జొన్నగిరి, పగిడిరాయి, రామలింగాయపల్లి, చెన్నంపల్లి గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే శ్రీదేవికి కృతజ్ఞతలు తెలియజేశారు.

భూహక్కు పత్రాల పంపిణీ

వెల్దుర్తి: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు – భూ రక్ష పథకంలో భాగంగా మండలంలోని పుల్లగుమ్మి, బుక్కాపురం గ్రామాలలో బుధవారం రైతులకు ఉచితంగా భూహక్కు పత్రాలను పంపిణీ చేశారు. వీఆర్‌ఓ ఎల్లకృష్ణ ఆధ్వర్యంలో పుల్లగుమ్మి సచివాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తహసీల్దార్ శివరాముడు, రీసర్వే డీటీ దీపిక, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేశ్వర్లు చేతుల మీదుగా మొదటి దశలో మంజూరైన 508 భూ హక్కు పత్రాలందించారు. బుక్కాపురంలో వీఆర్‌ఓ చేతుల మీదుగా 452 మందికి పత్రాలందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్, రీసర్వే టీడీ మాట్లాడుతూ ప్రజలపై ఒక్క పైసా భారం పడకుండా ప్రభుత్వం రీసర్వే నిర్వహిస్తోందన్నారు. పుల్లగుమ్మి గ్రామంలో 1018 మంది భూ యజమానులకు సంబంధించిన 1464.50 ఎకరాలు, బుక్కాపురంలో 1422 మందికి సంబంధించిన 5,238 ఎకరాల రీసర్వే పూర్తయిందని, కచ్చితమైన కొలతలతో సరిహద్దు రాళ్ల ఏర్పాటు జరుగుతోందన్నారు. కలుగొట్లలో త్వరలో రీసర్వే పూర్తి కాబోతోందని, రామళ్లకోట, మరో నాలుగు గ్రామాల్లో ప్రారంభించబడిందని తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



రైతులకు భూహక్కు పత్రాలు అందిస్తున్న రెవెన్యూ అధికారులు

ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలి

హొళగుంద: ఖరీఫ్‌లో సాగు చేసిన ప్రతి పంటను రైతులు తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏఓ ఆనంద్ లోకదళ్ సూచించారు. బుధవారం ఆయన సుళువాయి, కోగిలతోట, మార్లమడికి ఆర్బీకేల పరిధిలో ఇప్పటివరకు వీఏఏలు ఈ–క్రప్ నమోదు చేసిన పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. పంటల బీమా, పంట నష్ట పరిహారానికి ఈ–క్రాప్ బుకింగ్ ఎంతో కీలకమన్నారు. ఇంకా ఈ–క్రాప్, ఈకేవైసీ చేయించుకోని రైతులు వీఏఏలను సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు.

కృష్ణగిరి: ఖరీఫ్‌లో సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఈ–క్రాప్ బుకింగ్‌లో నమోదు చేసుకుంటేనే ప్రభుత్వం నుంచి పథకాలు అందుతాయని ఏఓ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఈ–క్రాప్ నమోదును పరిశీలించారు. ఈ నెల 25లోగా అందరూ క్రాప్ నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు.

ప్రభుత్వాసుపత్రి తనిఖీ



ఆసుపత్రి పరిసరాలను పరిశీలిస్తున్న డాక్టర్ శైలజ

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రిని బుధవారం సాయంత్రం డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ విజిలెన్స్ అధికారి డాక్టర్ శైలజ ఆకస్మిక తనిఖీ చేశారు. డాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేసిన అనంతరం ప్రభుత్వాసుప్రతిలో రోగుల వార్డులు, గదులు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్యులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించటంతో పాటు, సమయ పాలన పాటించాలన్నారు. ఆసుపత్రిలో డెలివరిలు, కుటుంబ నియంత్ర ఆపరేషన్లు, కంటి ఆపరేషన్లు, రోజు ఓపీ బాగానే ఉందని చెప్పారు. వంద పడకల ఆసుపత్రి పూర్తయ్యేవరకు ఉన్న సౌకర్యాలతో రోగులకు సేవలు అందించాలన్నారు. అవసరమైన సౌకర్యాలను పైస్థాయి అధికారులకు తెలియజేస్తానన్నారు. ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ మైత్రేయి, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

పిల్లిగుండ్లలో వైద్య శిబిరం

గోనెగండ్ల: మండల పరిధిలోని పిల్లిగుండ్ల గ్రామంలో గోనెగండ్ల ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పిల్లిగుండ్ల గ్రామంలో ఇటీవల రెండు డెంగ్యూ కేసులు నమోదు కావడం, జ్వరం బాధితులు ఎక్కువగా ఉండడంతో వైద్య సిబ్బంది ఆ గ్రామంలో శిబిరం నిర్వహించారు. శిబిరంలో డెంగ్యూ, మలేరియా కిట్లు ద్వారా జ్వరం వచ్చిన వారందరికీ డాక్టర్ రుక్సానా వైద్య పరీక్షలు చేశారు. అలాగే ఇతర వ్యాధులకు కూడా పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్ సందర్శించారు. వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో దోమల మందు పిచికారీ చేయించాలని అధికారులకు సూచించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా, సూపర్‌వైజర్లు హనుమంతు, పరమేష్, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

హాలహర్వి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈఓ ఈరన్న సూచించారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి సెలక్షన్ కొరకు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బాలబాలికలకు ఆటల పోటీలను బుధవారం మండల ఉన్నత పాఠశాల పీడీల ఆధ్వర్యంలో చేపట్టగా ఎంఈఓ ఈరన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చదువుతో పాటు ఆటలను కూడా ఆడాలని సూచించారు. క్రీడల్లో రాణించే వారికి మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు. హెచ్ఎం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీల్లో ప్రతిభ

హొళగుంద: ఇంగళదహాళ్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 12న జరిగిన ఎస్‌జీఎఫ్ గేమ్స్, అథ్లెటిక్స్ పోటీల్లో హొళగుంద జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. 9, 10వ తరగతి చదువుతున్న ఉరుకుంద, రుద్రమ్మ, శరణబసవ, నాగరాజు, నందిని, విద్యశ్రీ, యశోధ, విఘ్ణవర్ధన్, రుద్రేష్ తదితరులు వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్‌లో ప్రతిభ కనబరిచినట్లు హెచ్ఎం నజీర్ అహమ్మద్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులు, పీడీని అభినందించారు.

ఆధార్ అనుసంధానం తప్పనిసరి

నందవరం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీల బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం తప్పనిసరిగా చేయాలని ఏపీడీ అలీపిర ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లను ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ దశరథ రామయ్య ఆధ్వర్యంలో ఉపాధి హామీ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. .మండలంలో 456 మంది కూలీల బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం పెండింగ్‌లో ఉందని వివరించారు. ఆధార్ అనుసంధానం డిసెంబర్ 31వ వరకు పొడిగించారన్నారు. అలాగే జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలు చేపట్టే కూలీలకు 90 రోజుల పని దినాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఏపీఓ శ్రీనివాసులు, ఈసీ నూర్జహాన్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపాలిటీలో చెత్త తరలించే క్లాప్ ఆటో డ్రైవర్లకు బకాయిపడ్డ వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ తాలుకా అధ్యక్షుడు వీరేష్, సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్నలు కోరారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఆటో డ్రైవర్లతో కలిసి నిరసన తెలిపి మాట్లాడారు. క్లాప్ ఆటోలకు పెట్రోల్ వేయకపోవడంతో రెండు రోజులుగా ఆటోలు నిలిచిపోయాయన్నారు. నాలుగు నెలలుగా డ్రైవర్లకు వేతనాలు ఇవ్వడం లేదన్నారు. ఆయా వాహనాలు రిపేర్లకు వచ్చినా కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదన్నారు. సత్వరం ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరారు.

కౌలుట్ల చెన్నకేశవ స్వామి సన్నిధిలో ఎమ్మెల్యేలు

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో వెలసిన భూదేవి సమేత శ్రీలక్ష్మి కౌలుట్ల చెన్నకేశవ స్వామి వారిని బుధవారం ఆదోని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ముందుగా ఆలయ చైర్మన్ ఆర్.హనుమంతరెడ్డి వారికి శాలువాలు, పూలమాలలు వేసి ఆలయంలోకి స్వాగతించారు. స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందజేస్తామని ఎమ్మెల్యేలు హామీఇచ్చారు. ఎమ్మెల్యే సాయి కుమారుడు వై.జయమనోజ్ రెడ్డి, మంత్రాలయం ఎంపీపీ వై.గిరిజమ్మ, ఎర్రిస్వామి, ఆలయ ఉద్యోగి సురేష్ ఉన్నారు.



ఎమ్మెల్యేలు సాయిప్రసాద్ రెడ్డి, బాలనాగిరెడ్డిని ఆహ్వానిస్తున్న ఆలయ చైర్మన్ హనుమంతరెడ్డి

ప్రతి ఇంటికీ సంక్షేమ లబ్ధి

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని 18వ వార్డు పరిధిలో ఆ వార్డు ఇన్‌చార్జ్ సోమేష్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డి, అధికారులు, పార్టీ నాయకులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డు పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి బుక్‌లెట్ అందజేశారు. సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం జగనన్నకు రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు. వార్డు పరిధిలో సీసీ రోడ్లు, డ్రైన్ నిర్మాణం, విద్యుత్ స్తంభాల సమస్య, ఉన్న స్తంభాలకు విద్యుత్ తీగలు అమర్చాలని ఆ ప్రాంత వాసులు ఆయన దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, టౌన్‌బ్యాంక్, కోఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్లు యూకే రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వీరేంద్ర, కౌన్సిలర్లు డిష్ కేశవరెడ్డి, నాయకులు కోటకొండ నరసింహులు గట్టుభాజ, రుద్రాక్షాల బజారి, రజాక్, రంగన్న, సయ్యద్‌చాంద్, శ్రీను, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరు 18వ వార్డులో వృద్ధురాలికి సంక్షేమ క్యాలెండర్ అందిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

అజెండాలోని అంశాలను ఆమోదించండి

మద్దికెర: పంచాయతీ సభ్యుల సమావేశంలో అజెండాలో ఉన్న తీర్మానాల మేరకు అనుమతులు ఇవ్వాలని సభ్యులు బాలచంద్ర, లక్ష్మీనారాయణ, వరప్రసాద్ కోరారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సుహాసిని అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభ్యులు మాట్లాడుతూ.. గ్రామంలో సమస్యాత్మకమైన ప్రాంతాల్లో నిర్మాణాలకు సభ్యుల తీర్మానం మేరకు మాత్రమే అనుమతులు ఇవ్వాలన్నారు. అనంతరం ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, ఈఓ శ్రీహరి మాట్లాడుతూ..అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామని హెచ్చరించారు. అలాగే చెరువుల్లో చేపల పెంపకానికి సంబంధిత వారికి నోటీసులు ఇవ్వడం జరిగిందని సకాలంలో స్పందించకపోతే వేలాలు నిర్వహిస్తామన్నారు. ఎంపీపీ అనిత, ఉప సర్పంచ్ ప్రమీలమ్మ, సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

భవన నిర్మాణాలు పూర్తిచేయాలి



మాట్లాడుతున్న పీఆర్–2 చీఫ్ ఇంజనీర్ ఎం.కృష్ణారెడ్డి

ఎమ్మిగనూరురూరల్: గ్రామాల్లో సచివాలయాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, పాల కేంద్రాల భవన నిర్మాణాలను త్వరితిగతిన పూర్తి చేయాలని పంచాయతీరాజ్–2 చీఫ్ ఇంజనీర్ ఎం.కృష్ణారెడ్డి ఆదేశించారు. బుధవారం సాయంత్రం మండల పరిధిలోని ఎర్రకోట గ్రామంలో సచివాలయ భవనాన్ని పరిశీలించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం మండలాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాలన్నారు. పూర్తయిన దశలను బట్టి బిల్లులు వెంటనే మంజూరు చేస్తామని చెప్పారు. నిర్మాణాలలో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కడప ఈఈ పి.నాగేశ్వరరెడ్డి, ఆదోని పీఆర్ ఈఈ ఏ.వెంకటప్రసాద్, డిప్యూటీ ఈఈ ఈరన్న, కర్నూల్–2 ఏఈ ముక్తర్ బాషా, పీఆర్ డీఈ చంద్రశేఖర్, మండల ప్రత్యేకధికారి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘ఆరోగ్య సురక్ష’ పక్కాగా నిర్వహించాలి

వెల్దుర్తి: ఈనెల 15 నుంచి ప్రారంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది విజయవంతం చేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి(డీఐఓ) డాక్టర్ ప్రవీణ్ కుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన ఉలిందకొండ పీహెచ్‌సీ, స్థానిక సీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు, రోగులందుతున్న సేవలు, సౌకర్యాలను పరిశీలించారు. ఆయా ఆసుపత్రులలో వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతూ.. ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి ఒక్కరినీ ఆరోగ్యంగా ఉంచే ప్రయత్నం చేస్తోందన్నారు. ఏఎన్ఎమ్‌లు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలు సేకరించాలన్నారు. చికిత్సలు అవసరమైన వారికి టోకెన్లు అందించి ఈనెల 30 నుంచి నిర్వహించే శిబిరాలకు తరలించేలా చూడాలన్నారు. కచ్చితమైన ప్రణాళికతో, కరపత్రాల ద్వారా అవగాహన కల్పించి, కిట్లు, మందులు సిద్ధం చేసుకుని విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. సీహెచ్‌సీ డాక్టర్ హిమబిందు, ఉలిందకొండ పీహెచ్‌సీ సిబ్బంది ఉన్నారు.

ఆలూరు రూరల్: ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు మీ ఇంటికే ఆరోగ్య సిబ్బంది వచ్చే విధంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎంపీడీఓ అల్లబకాష్ చెప్పారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. సచివాయ కార్యదర్శులు ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుంటారన్నారు. వివరాలన్నీ ప్రభుత్వం అందజేసిన 15 అంశాల్లో పొందుపరుస్తారని తెలిపారు. ఈ నెల 29వ తేదీ వరకు సర్వే చేయాల్సి ఉంటుందన్నారు. 30వ తేదీన గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య చికిత్సలందిస్తారని వెల్లడించారు.

చిప్పగిరి: ఈ నెల 15 నుంచి నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల ప్రత్యేక అధికారి వేణుగోపాల్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 15 నుంచి వైద్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య స్థితిగతులను సర్వే చేసి యాప్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. ఆరోగ్య సమస్యలున్న వారికి టోకెన్ ఇవ్వాలని, సర్వే పూర్తయిన తర్వాత నిపుణులైన డాక్టర్లు ఆయా గ్రామాలకు వెళ్లి వైద్యం అందిస్తారని తెలిపారు. మెడికల్ ఆఫీసర్ జమీల్ అహమ్మద్, ఎంపీడీఓ సీవీ కొండయ్య, సీహెచ్ఓ వెంకటేశ్వర్లు, ఏఎన్ఎంలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వెల్దుర్తి సీహెచ్‌సీలో సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఐఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కృష్ణగిరి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ విశ్వమోహన్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన వైద్యాధికారులు, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, వలంటీర్లకు జగనన్న ఆరోగ్య సురక్షపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో నిర్వహించే సర్వేకు వలంటీర్లు విధిగా పాల్గొని రోగుల వివరాలను యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. వైద్యులు ప్రదీప్, వరప్రసాద్, ఎంపీహెచ్ఓ గజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.